ADVERTISING
నేటి దర్శిని తెలుగు దిన పత్రికలో ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365

WWW.NETIDARSHINI.COM

# నేటి దర్శిని

PRGI NO: APTEL/26/A5450
తెలుగు దిన పత్రిక
సత్య శోధనే మా లక్ష్యం...

రిపోర్టర్లు కావలెను
జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి దర్శిని ఆహ్వానం పలుకుతుంది. తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.
Contact Number 9059328777

ఆంధ్రప్రదేశ్ ( క్రిష్ణ ) బుధవారం 08-07-2026 సంపుటి: 01 సంచిక : 4 వెల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని
Andhrapradesh(Krishna) Wednesday 08-07-2026 Volume :01 Issue: 4 RS: 2 Pages:08 Editor : Katta HimaPavani



## మన బంధానికి పునాది రామాయణ, మహాభారతాలే

- ఇండోనేసియా పార్లమెంటులో మోదీ కీలక వ్యాఖ్యలు
- ఇండోనేసియా పార్లమెంటును ఉద్దేశించి ప్రధాని మోదీ కీలక ప్రసంగం
- రెండు దేశాల ప్రాచీన, సాంస్కృతిక, చారిత్రాత్మక బంధాల ప్రస్తావన
- సముద్రం విడదీయలేదు కలిపిందని వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ జూలై 7 (నేటి దర్శిని)**
ఇండోనేసియా పర్యటనలో ఉన్న భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ- ఆ దేశ పార్లమెంటును ఉద్దేశించి చేసిన ప్రసంగంలో కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ ఇండోనేసియా సంబంధాల చారిత్రక, సాంస్కృతిక, పుణ్యాత్మక ప్రాధాన్యాన్ని వివరించారు. రెండు దేశాల మధ్య బంధం సముద్రంతో కాకుండా వేల ఏళ్ల చరిత్ర, సంస్కృతి, ఆధ్యాత్మిక వారసత్వంతో ముడిపడి ఉందని ఆయన పేర్కొన్నారు. సముద్రం ఎప్పుడూ రెండు దేశాల్ని

-మిగతా 2 లో



## పుంజుకున్న నైరుతి రుతుపవనాలు

- జూలై తొలి వారంలో 11 శాతం అధిక వర్షపాతం
- రానున్న రోజుల్లో విస్తారంగా వర్షాలు
- అల్పపీడనంతో పలుచోట్ల భారీ వర్షాలు
- ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌కు ఐఎండీ హెచ్చరిక

**న్యూఢిల్లీ,**
ఈ సంవత్సరం మందకొడిగా ప్రారంభమైన నైరుతి రుతు పవనాలు పుంజుకున్నాయి. జూలై మొదటి వారంలో దేశమంతటా మిగులు వర్షపాతం నమోదైంది. భారత వాతావరణ శాఖ విడుదల చేసిన తాజా డాటా ప్రకారం.. సాధారణంగా జూలై 1 నుంచి జూలై 6 వరకు నమోదయ్యే 48 మి.మీకు బదులుగా 53.3 ఎంఎం వర్షపాతం రిక్షర్డైంది. ఇది 11 శాతం ఎక్కువని ఐఎండీ తెలిపింది.ఇస్రోకు చెందిన చిత్రాలు కూడా రుతు పవనాల పునరుజ్జీవనాన్ని సూచిస్తున్నాయి. అరేబియా సముద్రం నుంచి బంగాళాఖాతం వరకు, హిమాలయ పాద పర్వత ప్రాంతం వరకు క్రియాశీలక వాతావరణ వ్యవస్థల ప్రభావంతో ఉంది. దీని కారణంగా రానున్న రోజుల్లో విస్తృతంగా వర్షాలు పడుతాయని అంచనా వేస్తున్నారు. కాగా, బంగాళాఖాతంలోని అల్పపీడనం కదులుతున్నందున రానున్న 36 నుంచి 48 గంటల్లో ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తూర్పు మధ్యప్రదేశ్ ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు కురువవచ్చును ఐఎండీ హెచ్చరించింది.

## పారిశ్రామికవేత్తలుగా రైతులు


### పెరుగుతున్న ఇథనాల్ డిమాండ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- ఆ రంగంలో పెట్టుబడులు ఆకర్షించాలి
- గ్రామీణ ఎకానమీ బలోపేతమయ్యే ప్రణాళిక
- ఆ దిశగా ప్రత్యేక పాలసీ రూపకల్పన చేయాలి
- పర్యాటక రంగంలో అపార అవకాశాలు
- 100 ఎక్స్‌పీరియన్స్ సెంటర్ల ఏర్పాటు లక్ష్యం
- రైల్వే టెర్మినల్స్‌తో ఎంఎ సఎంఈల సంధానం
- 19వ ఎస్ఐపీబీ సమావేశంలో సీఎం
- రూ.9,676 కోట్లతో 11 ప్రాజెక్టులకు ఓకే
- 11 వేల మందికి ఉద్యోగ అవకాశాలు

**అమరావతి, జూలై 7 (నేటి దర్శిని)**
రైతు కుటుంబాలు కూడా పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా పారిశ్రామికీకరణ ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఇథనాల్‌కు డిమాండ్ పెరగనున్న నేపథ్యంలో ఆ రంగంలో రైతులను ప్రోత్సహించాలని సూచించారు. రూరల్ ఎకానమీని బలోపేతం చేసేలా ఇథనాల్ పరిశ్రమల ఏర్పాటు దిశగా సమగ్ర ప్రణాళికలను రూపొందించాలని చెప్పారు. ఇథనాల్, మీథేన్, ఏవియేషన్ ఇంధనానికి సంబంధించి ఒక ప్రత్యేక పాలసీ రూపొందించాలన్నారు. రాష్ట్ర సచివాలయంలో మంగళవారం 19వ రాష్ట్ర స్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశం జరిగింది.

-మిగతా 2 లో







## బ్యాట్లెత్తిసిన భారత్..

- 125 రన్స్ తేడాతో అతి పెద్ద పరాజయం
- మూడో టీ20లో ఇంగ్లండ్ ఘన విజయం

2





2

## మీ సీఎం ఏం చేయాలో సుప్రీంకోర్టు చెప్పాలా'..

- తమిళనాడులో ప్రతిపక్ష డీఎంకేపై సుప్రీంకోర్టు ఫైర్
- రాజకీయ విభేదాలకు కోర్టును వేదిక చేయొద్దని హితవు
- సీఎం పర్యటనలపై ఆంక్షల వాదనను తప్పుబట్టిన ధర్మాసనం
- పిటిషన్‌ను ఉపసంహరించుకున్న డీఎంకే
- కరూర్ తొక్కిసలాట కేసులో కొనసాగుతున్న సీబీఐ దర్యాప్తు



## భోగాపురం విమానాశ్రయం త్వరలో ప్రారంభం

- భోగాపురం విమానాశ్రయాన్ని సందర్శించిన రామ్మోహన్ నాయుడు
- అన్ని పనులు పూర్తయ్యాయని తెలిపిన కేంద్ర మంత్రి
- మోదీ సమయం ఖరారు చేస్తే ప్రారంభోత్సవం ఉంటుందని వెల్లడి

**అమరావతి**
ఉత్తరాంధ్రలో కొత్త అభివృద్ధి చరిత్రకు నాంది పలుకుతూ భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణం పూర్తి స్థాయికి చేరుకుంది. కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు మంగళవారం విమానాశ్రయాన్ని సందర్శించి పనుల పురోగతిని సమీక్షించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన స్పష్టమైన ఆదేశాలతో జీఎంఆర్ సంస్థ షెడ్యూల్ ప్రకారం పనులు పూర్తి చేసిందని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. ఇప్పటికే ఎయిరోడ్రోమ్ లైసెన్స్ వచ్చేసిందని వెల్లడించారు. ప్రధాని మోదీ సమయం ఖరారు చేస్తే వారి చేతుల మీదుగా ప్రారంభోత్సవ వేడుక ఉంటుందని కేంద్ర


-మిగతా 2 లో

## ఒప్పందం కుదరాలి-లేదంటే యుద్ధమే

- ఇరాన్‌పై ట్రంప్ కీలక వ్యాఖ్యలు
- చర్చలకే తొలి ప్రాధాన్యం ఇస్తున్నామని ట్రంప్ వ్యాఖ్యలు
- అవసరమైతే గంటల వ్యవధిలో కీలక మౌలిక వసతులను ధ్వంసం చేయగలమని హెచ్చరిక

2

ఒప్పందం చేసుకోండి... లేకపోతే యుద్ధమే!" అంటూ ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. చర్చలకు తాము సిద్ధమేనని స్పష్టం చేస్తూనే, అవసరమైతే గంటల వ్యవధిలోనే ఇరాన్ కీలక సైనిక, అణు స్థావరాలను ధ్వంసం చేసే సామర్థ్యం అమెరికాకు ఉందని ప్రకటించగా... ట్రంప్ వ్యాఖ్యలను ఇరాన్ తీవ్రంగా ఖండిస్తూ ప్రతిస్పందించింది.





## పొగాకు రైతుల సమస్యలు పరిష్కరిస్తా

- వర్జీనియా పొగాకు కొనుగోళ్లపై మంత్రి అచ్చెన్నాయుడు సమీక్ష
- ఈ నెల 9న ఏపీకి టొబాకో బోర్డు సెంట్రల్ జాయింట్ సెక్రటరీ రాక
- ఆక్షన్ సెంటర్లను సందర్శించాలని సహచర మంత్రులకు విజ్ఞప్తి

**ఏపీ బ్యూరో:జూలై 7 (నేటి దర్శిని)**
వర్జీనియా పొగాకు కొనుగోళ్ల ప్రక్రియ, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించే చర్యలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మంగళవారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో సామాజిక సంక్షేమ, విద్యుత్, రెవెన్యూ శాఖల మంత్రులతో పాటు టొబాకో బోర్డు చైర్మన్, టొబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పాల్గొన్నారు. రాష్ట్రంలోని అన్ని ఆక్షన్ ప్లాట్‌ఫార్మ్‌ల పరిస్థితి, కొనుగోళ్ల పురోగతి, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై మంత్రి సమగ్రంగా చర్చించారు. ఈ నెల 9న టొబాకో బోర్డు కేంద్ర సంయుక్త కార్యదర్శి ఆంధ్రప్రదేశ్‌కు వస్తున్న నేపథ్యంలో రైతులు, పొగాకు కొనుగోలు సంస్థల ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

-మిగతా 2 లో

## ఎల్-నినో ప్రభావంపై రాష్ట్రం హై అలర్ట్


'జీరో లాస్' లక్ష్యంతో ముందస్తు చర్యలకు లమంత్రి అనిత ఆదేశాలు




- నైరుతి రుతుపవనాల సవాళ్లను ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు పూర్తి సన్నద్ధంగా ఉండాలని స్పష్టం
- వరదలు, పిడుగులు, సముద్ర హెచ్చరికలపై ప్రజలకు వేగంగా సమాచారం చేరేలా అన్ని శాఖల సమన్వయం
- విపత్తు నిర్వహణకు వందల కోట్ల నిధులు విడుదల.. యువ ఆపదమిత్రలతో క్షేత్రస్థాయిలో స్పందన బలోపేతం
- రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత

**అమరావతి జూలై 7 (నేటి దర్శిని)**
ఎల్-నినో ప్రభావంతో రాష్ట్రంలో నైరుతి రుతుపవనాల కాలంలో వర్షాభావం, కరువు, వరదలు, పిడుగులు వంటి విపత్తులు సంభవించే అవకాశాల నేపథ్యంలో అన్ని ప్రభుత్వ శాఖలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర హోం, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. ప్రజా ప్రాణాలు, జీవనోపాధి రక్షణే ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యత అని స్పష్టం చేస్తూ, 'జీరో లాస్' లక్ష్యంతో ప్రతి శాఖ సమన్వయంతో ముందుకెళ్లాలని సూచించారు. మంగళవారం అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో మంత్రి వంగలపూడి అనిత, ఏపీఎస్డీఎం ఏ మేనేజింగ్ డైరెక్టర్ ప్రభాకర్ జైన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోసర్ బాన్‌తో పాటు

-మిగతా 2లో



## వయనాడ్‌లో బీభత్సం..

- కొండచరియలు విరిగిపడి ముగ్గురు మృతి..
- శిథిలాల కింద చిక్కుకున్న పలువురు
- ఘటనా స్థలంలో సహాయక చర్యలు ముమ్మరం
- ఎన్‌డీఆర్ఎఫ్, రెస్క్యూ బృందాల గాలింపు
- మరోసారి కొండచరియల ప్రమాదంపై ఆందోళన

**వయనాడ్ జూలై 7 (నేటి దర్శిని)**
కేరళలోని వయనాడ్ జిల్లాలో దారుణ ప్రమాదం జరిగింది. టన్నెల్ వద్ద కొండ చరియలు విరిగిపడిన ఘటనలో ముగ్గురు మరణించారు. మట్టిదిబ్బల కింద మరికొందరు చిక్కుకున్నారు. ఈ ఘటన కేరళలోని వయనాడ్ జిల్లా, మెప్పాడి సమీపంలోని కల్లాడి వద్ద మంగళవారం జరిగింది. స్థానిక మీనాక్షి బ్రిడ్జి వద్ద ఒక టన్నెల్ కోసం తవ్వాలు, నిర్మాణం జరుగుతున్న ప్రదేశంలో కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో ఆ మట్టిదిబ్బలు, రాళ్ల కింద పలువురు చిక్కుకుపోయారు. వీరిలో ముగ్గురు మరణించారు. ఘటనపై సమాచారం అందుకున్న

-మిగతా 2 లో

RNI NO: TGTEL/25/A0471 తెలుగు దిన పత్రిక సత్య శోధనే మా లక్ష్యం WWW.NETIDARSHINI.COM

## మన బంధానికి పునాది రామాయణ, మహాభారతాలే

మొదటి తరువాయి

విడదీయలేదని, అది ఎప్పటికీ రెండు దేశాల అనుబంధానికి వారధిగా నిలిచిందని చెప్పారు. ఇండోనేసియా పార్లమెంట్ సభ్యుల్ని ఉద్దేశించి మాట్లాడిన మోదీ- ప్రబోవో సుబియాంటోతో జరిగిన చర్చలు ఇరు దేశాల సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తాయని చెప్పారు. 2018లోనే ప్రారంభమైన ఈ భాగస్వామ్యం ఇప్పుడు అభివృద్ధి, భద్రత, సాంకేతికత, విద్య, సంస్కృతి వంటి ఎన్నో రంగాలకు విస్తరించిందన్నారు. ఈ సందర్భంగానే రామాయణం, మహాభారతం రెండు దేశాల బంధానికి పునాది అని వ్యాఖ్యానించారు మోదీ. 'భారత్- ఇండోనేసియాను కేవలం సముద్రం మాత్రమే కలపలేదు. మనకు ఉమ్మడి చరిత్ర ఉంది. రామాయణం, మహాభారతం, నలందా విజ్ఞాన సంపద మన బంధానికి పునాది. వయాంగ్ కళారూపం, నృత్యం, సంగీతం, బోరోబుదూర్, ప్రంబనన్ వంటి అద్భుత కట్టడాలు మన సాంస్కృతిక అనుబంధానికి నిదర్శనం. ఇండోనేసియా జాతీయ చిహ్నమైన గరుడ, బాలి యాత్రా ఉత్సవం కూడా మన మధ్య ఉన్న బంధాన్ని గుర్తు చేస్తాయి' అని మోదీ పేర్కొన్నారు.

క్రుపుక్, పాపడ్- ఏది క్రిస్పీగా ఉంటుంది?

మోదీ ప్రసంగంలో ఆహార సంస్కృతి గురించి కూడా ప్రస్తావించారు. 'ఇండోనేసియా క్రుపుక్ లేదా మన పాపడ్ (అప్పడం) ఏది ఎక్కువగా కరకరలాడుతుంది (క్రిస్పీ) అంటే చెప్పడం కష్టం. కానీ మసాలాలు, బుంబు (సుగంధ ద్రవ్యాలు) మాత్రం రెండు దేశాల జీవితాల్లో అంతర్భాగంగా మారిపోయాయి' అని వ్యాఖ్యానించారు. భారత రాజధాని, ఇండోనేసియా రాజధాని మధ్య వేల కిలోమీటర్ల దూరం ఉన్నప్పటికీ సముద్ర మార్గంలో కేవలం 150 కిలోమీటర్ల దూరమే ఉందని మోదీ గుర్తు చేశారు. చాలా దేశాలకు సముద్రమే సరిహద్దు అని, కానీ భారత్- ఇండోనేసియా మధ్య సముద్రం ఎప్పుడూ విభజనకు చిహ్నం కాదన్నారు. అదే మనల్ని కలిపే వంతెన అని, అదే మన భవిష్యత్తుకు కేంద్ర బిందువు అన్నారు ప్రధాని.


'ఇరు దేశాల బంధాన్ని కొత్త శిఖరాలకు చేరుద్దాం'

'ఇండియా, ఇండోనేసియా.. ఇండియన్ ఓషియన్ (హిందూ మహాసముద్రం)- ఈ పేర్లే మన మధ్య ఉన్న గాఢమైన చారిత్రక బంధానికి సాక్ష్యం. వేల సంవత్సరాలుగా మన నౌకాశ్రయాలు ప్రపంచాన్ని అనుసంధానించాయి. మన నౌకలు వాణిజ్యంతో పాటు సంస్కృతిని కూడా ప్రపంచ నలుమూలలకు చేర్చాయి. సముద్ర సంబంధాల ద్వారా భవిష్యత్తులో అపార అవకాశాలు ఉన్నాయి. ఈ విశాలమైన మహాసముద్రాన్ని స్ఫూర్తిని తీసుకొని భారత్- ఇండోనేసియా సంబంధాల్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్దాం' అని పిలుపునిచ్చారు. ఇక భారత్ ఎప్పుడూ విస్తరణ వాదాన్ని అనుసరించలేదని, అభివృద్ధినే లక్ష్యంగా పెట్టుకుందని ప్రధాని స్పష్టం చేశారు. 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్' అనే సిద్ధాంతంతో అందరి భాగస్వామ్యంతో అందరి అభివృద్ధి 'భారత్ లక్ష్యం' అనే సందేశంతో నేను మీ ముందుకు వచ్చాను" అని మోదీ పేర్కొన్నారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వానికి ఆసియాన్ (ఆగ్నేయాసియా) కీలక పాత్రకు భారత్ ఎప్పుడూ ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చిందని మోదీ స్పష్టం చేశారు.

## బ్యాట్లెత్తిసిన భారత్..

**125 రన్స్ తేడాతో అతి పెద్ద పరాజయం**

**మూడో టీ20లో ఇంగ్లండ్ ఘన విజయం**




నాటింగ్‌హామ్

టీ20 వరల్డ్‌కప్ నెగ్గిన తర్వాత కొత్త కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలో భారత్ చెత్తాటతో నిరాశపరుస్తోంది. ఐర్లాండ్ చేతిలో వైట్‌వాష్ అయిన తర్వాత ఇంగ్లండ్ గడ్డపై అడుగుపెట్టిన అయ్యర్‌సేన వరుసగా రెండో ఓటమి ఖాతాలో వేసుకుంది. గత పోరులో బౌలింగ్‌లో ఫెయిలైన భారత్ ఈసారి పేలవ బ్యాటింగ్‌తో అతి పెద్ద పరాజయంతో తలదించుకుంది. మంగళవారం రాత్రి జరిగిన మూడో టీ20లో 125రన్స్ తేడాతో ఓడింది. షార్ట్ ఫార్మాట్‌లో పరుగుల పరంగా భారత్‌కు ఇదే అతి పెద్ద ఓటమి. 2019లో వెల్లింగ్టన్‌లో న్యూజిలాండ్ చేతిలో 80 రన్స్ తేడాతో ఓడిన మెన్ ఇన్ బ్లూ ఇప్పుడు మరింత చెత్త రికార్డు ఖాతాలో వేసుకుంది. ఇంగ్లండ్ ఇచ్చిన 202 పరుగుల లక్ష్య ఛేదనలో టీమిండియా 11.4 ఓవర్లలో 76 రన్స్‌కే కుప్పకూలింది. జోష్ టంగ్ (4/28), జోఫ్రా ఆర్చర్ (3/29) పేస్ ధాటికి టాప్, మిడిలార్డర్ కుదేలైంది. ఓపెనర్లు అభిషేక్ (10), సూర్యవంశీ (13)తో పాటు ఇషాన్ (13), కెప్టెన్ అయ్యర్ (5), అక్షర్ (10), తిలక్ (3), శివం దూబే (2) పెవిలియన్‌కు క్యూకట్టడంతో జట్టుకు ఘోర పరాభవంతప్పలేదు. తొలుత టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లిష్ టీమ్ 20 ఓవర్లకు 201/7 స్కోరు చేసింది. ఓపెనర్ ఫిల్ సాల్ట్ (44 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 70), ఆల్‌రౌండర్ సామ్ కరన్ (41 నాటౌట్), జోస్ బట్లర్ (36) మెరుపులు మెరిపించారు. భారత బౌలర్లలో ప్రిన్స్, హర్షిత్ చెరో రెండు వికెట్లు తీశారు. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇంగ్లండ్ 2-0తో ఆధిక్యంలో నిలిచింది. ఇరు జట్ల మధ్య నాలుగో టీ20 గురువారం జరుగుతుంది.

## వయనాడ్‌లో బీభత్సం..

మొదటి తరువాయి

ఫైర్, రెస్క్యూ బృందాలు యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు ప్రారంభించాయి. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ ఘటనపై కేరళ సీఎం వీడీ సతీషన్ కూడా స్పందించారు. వయనాడ్ జిల్లా అధికారులతో మాట్లాడారు. తక్షణమే సహాయక చర్యలు ప్రారంభించి బాధితుల్ని కాపాడాలని, వ్యవస్థల్ని సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. సహాయక చర్యల్ని పర్యవేక్షించాల్సిందిగా మంత్రులు ఏపీ అనిల్ కుమార్, టీ సిద్దిఖ్‌లను ఆదేశించారు. భారీ వర్షాల కారణంగా ఇక్కడ టన్నెల్ నిర్మాణ పనుల్ని సోమవారం నుంచే నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రాంతంలో గడిచిన 24 గంటల్లో 265 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షాల కారణంగానే ఈ కొండచరియలు విరిగిపడి ఉంటాయని అధికారులు భావిస్తున్నారు. ఘటనా స్థలం వద్ద ఇంకా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. రెస్క్యూ ఆపరేషన్స్ రాకముందే స్థానికులు సహాయక చర్యల్లో పాల్గొన్నారు ఆరుగురిని రక్షించారు. ఈ ఘటనలో ముగ్గురు మరణించగా, మిగిలిన వారి కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మరోవైపు ఈ ప్రాంతంలో కొండచరియలు విరిగిపడటం వల్ల పలు వాహనాలు కూడా దెబ్బతిన్నాయి. భారీ వర్షాలు, కొండచరియలు విరిగిపడటం వల్ల స్తానికంగా నివసించే వారి భద్రత విషయంలో అనుమానాలు తలెత్తుతున్నాయి. ఇండ్లకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని స్థానికులు భావిస్తున్నారు. పోలీసులతోపాటు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యల్లో పాళ?ంటున్నాయి.

## భోగాపురం విమానాశ్రయం త్వరలో ప్రారంభం

మొదటి తరువాయి



మంత్రి తెలిపారు. 78 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మితమైన టెర్మినల్ భవనం సంవత్సరానికి ఏకంగా నాలుగు కోట్ల మంది ప్రయాణికులకు సేవలు అందించే సామర్థ్యం కలిగి ఉంటుందని చెప్పారు. ఉత్తరాంధ్ర సంస్కృతి, కళలు ఉట్టిపడేలా డిజైన్ చేయడంతో ఇది దేశంలోనే అత్యుత్తమ విమానాశ్రయాల్లో ఒకటిగా నిలుస్తుందని వ్యాఖ్యానించారు. ప్రారంభమైన వారం లోపు విశాఖ విమానాశ్రయ కార్యకలాపాలను భోగాపురానికి మార్చి పూర్తి స్థాయిలో సేవలు ప్రారంభిస్తామని తెలిపారు.

## పారిశ్రామికవేత్తలుగా రైతులు

మొదటి తరువాయి



ఈ సమావేశంలో రూ. 9,676 కోట్ల పెట్టుబడులు, 10,931 మందికి ఉద్యోగావకాశాలను కల్పించే 11 ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, పెట్రోల్‌లో కలిపేందుకు ఇథనాల్ భారీగా అవసరం కానుందని చెప్పారు. ఇథనాల్ బ్లెండింగ్ 40 శాతానికి పెరిగితే, మొక్కజొన్న పంటకు డిమాండ్ ఏర్పడుతుందని అన్నారు. ఇథనాల్ తయారీ రంగంలో వచ్చే అన్ని పెట్టుబడులను ప్రోత్సహించాలని సూచించారు. సంపద సృష్టి, సర్క్యులర్ ఎకానమీ అనేది ప్రభుత్వ విధానమని వెల్లడించారు.ఇక రాష్ట్ర పర్యాటక రంగంలోనూ అపార అవకాశాలున్నాయని చంద్రబాబు చెప్పారు. తిమ్మమ్మ మర్రిమానుతో సహా రాష్ట్రవ్యాప్తంగా 100 ఎక్స్‌పీరియన్స్ సెంటర్లను ఏర్పాటు చేయడమే లక్ష్యమన్నారు. పోలవరం, దిండి, గండికోట, కంబం చెరువులాంటి ప్రాంతాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. లంబసింగి, అరకు సమీపంలో రిసార్ట్స్ ఏర్పాటు చేయాలన్నారు. జిందాల్ సంస్థ లంబసింగి, అరకు ప్రాంతాల్లో రిసార్ట్స్ ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపుతోందని తెలిపారు. ఏటికొప్పాక, కొండపల్లి, ధర్మవరం, మంగళగిరి, ఉప్పాడ, పొందూరు కళారూపాలను కూడా పెద్దఎత్తున ప్రోత్సహించాలన్నారు. పర్యాటక రంగం నుంచి రాష్ట్ర ఆదాయం పెరిగేలా చూడాలన్నారు. పర్యాటకరంగ అభివృద్ధికి అవసరమైన హోటల్ గదులు పెద్దఎత్తున వస్తున్నాయన్నారు. 2024లో 4,390 హోటల్ రూములు ఉంటే.. ఈ రెండేళ్లలో 9,364కు నిర్మాణంలో ఉన్నాయని వెల్లడించారు. సోలార్ సెల్స్ తయారీలో అగ్రగామి కావాలి రెన్యూవబుల్ ఎనర్జీ విస్తృతం కావడంతో సోలార్ సెల్స్ తయారీ పరిశ్రమలను రాష్ట్రానికి ఆహ్వానించాలని అధికారులకు సీఎం స్పష్టం చేశారు. సోలార్ సెల్స్ తయారీలో ఏపీ అగ్రగామిగా నిలవాలని ఆకాంక్షించారు. ఇంకా ఏర్పాటు చేయాల్సిన 38 ఎంఎస్ఎంఈ పార్కులను త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు చేపట్టాలన్నారు. రైల్వే టెర్మినల్స్‌కు ఎంఎస్ఎంఈలను అనుసంధానం చేయాలని సూచించారు. సమావేశంలో మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, పి.నారాయణ, గొట్టిపాటి రవికుమార్, కందుల లక్ష్మీ దుర్గేశ్, సీఎస్ సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మీ సీఎం ఏం చేయాలో సుప్రీంకోర్టు చెప్పాలా'.

**-తమిళనాడులో ప్రతిపక్ష డీఎంకేపై సుప్రీంకోర్టు ఫైర్**
**-రాజకీయ విభేదాలకు కోర్టును వేదిక చేయొద్దని హితవు**
**-సీఎం పర్యటనలపై ఆంక్షల వాదనను తప్పుబట్టిన ధర్మాసనం**
**-పిటిషన్‌ను ఉపసంహరించుకున్న డీఎంకే**
**-కరూర్ తొక్కిసలాట కేసులో కొనసాగుతున్న సీబీఐ దర్యాప్తు**



న్యూఢిల్లీ

తమిళనాడు లో ప్రతిపక్ష పార్టీ డీఎంకే పై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తంచేసింది. ముఖ్యమంత్రి విజయ్ పర్యటనలు, ప్రసంగాలపై ఆంక్షలు విధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం.. రాజకీయ విభేదాలను పరిష్కరించుకోవడానికి సుప్రీంకోర్టును వేదికగా మార్చవద్దని స్పష్టంచేసింది. ఈ వ్యాఖ్యలతో డీఎంకే వెనక్కి తగ్గి తన పిటిషన్‌ను ఉపసంహరించుకుంది.కరూర్ తొక్కిసలాట కేసులో సీబీఐ దర్యాప్తు కొనసాగుతున్న సమయంలో ముఖ్యమంత్రి విజయ్ జూలై 10న అక్కడ పర్యటించనున్నారని డీఎంకే కోర్టు దృష్టికి తీసుకొచ్చింది. మృతుల కుటుంబాలకు ఉద్యోగ నియామక పత్రాలు, ఆర్థిక సాయం అందించే కార్యక్రమం దర్యాప్తులో ఉన్న సాక్షులపై ప్రభావం చూపే అవకాశం ఉందని వాదించింది. అంతేకాదు టీవీకే నేత ఆదవ్ అర్జున చేసిన వ్యాఖ్యలపైనా అభ్యంతరం వ్యక్తంచేసింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ప్రసంగాలు, పర్యటనలపై ఆదేశాలు ఇవ్వాలని కోరింది. అయితే ఈ వాదనలను సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. 'ముఖ్యమంత్రి ఏం చేయాలో కూడా సుప్రీంకోర్టే చెప్పాలా..? ఆయన ఈ కేసులో నిందితుడు కాదు. స్వేచ్ఛగా మాట్లాడే హక్కుపైనా ఆంక్షలు కోరుతున్నారా..? రాజకీయ ప్రత్యర్థుల వ్యాఖ్యలపై ఈ కోర్టు ఎలా ఆదేశాలు ఇస్తుంది..?' అంటూ ధర్మాసనం ప్రశ్నించింది. దాంతో డీఎంకే తన పిటిషన్‌ను వెనక్కి తీసుకునేందుకు అనుమతి కోరగా కోర్టు అంగీకరించింది. కాగా గత ఏడాది సెప్టెంబర్‌లో కరూర్‌లో విజయ్ ఎన్నికల ప్రచార సభ సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో 41 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై సీబీఐ దర్యాప్తు కొనసాగుతోంది. తొక్కిసలాటకు టీవీకే కార్యకర్తల నిర్లక్ష్యమే కారణమని డీఎంకే ఆరోపిస్తుండగా, ఇదంతా డీఎంకే రాజకీయ కుట్రేనని విజయ్, టీవీకే నేతలు ఆరోపిస్తున్నారు.

## ఒప్పందం కుదరాలి- లేదంటే యుద్ధమే

**-ఇరాన్‌పై ట్రంప్ కీలక వ్యాఖ్యలు**
**-చర్చలకే తొలి ప్రాధాన్యం ఇస్తున్నామని ట్రంప్ వ్యాఖ్యలు**
**-అవసరమైతే గంటల వ్యవధిలో కీలక మౌలిక వసతులను ధ్వంసం చేయగలమని హెచ్చరిక**




న్యూఢిల్లీ

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి ఇరాన్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో తమకు రెండు మార్గాలే ఉన్నాయని, ఒకటి పరస్పర ఒప్పందానికి రావడం, లేదంటే తమ లక్ష్యాన్ని పూర్తి చేయడమేనని స్పష్టం చేశారు. తాము తలచుకుంటే ఇరాన్ కీలక మౌలిక సదుపాయాలను దెబ్బతీసే సామర్థ్యం అమెరికాకు ఉందని అన్నారు. అయితే సైనిక చర్యల కంటే చర్చల ద్వారానే సమస్యకు పరిష్కారం లభించాలని తాను కోరుకుంటున్నానని వెల్లడించారు. మీడియాతో మాట్లాడుతూ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు.

'మేం ఏదోక విధంగా గెలుస్తాం. ఇరాన్‌తో ఒప్పందం కుదుర్చుకుంటాం లేదా మా పనిని పూర్తిచేస్తాం. సైనిక చర్యల వల్ల కోట్లాది మంది ప్రజలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో చర్చలకే ప్రాధాన్యం ఇస్తున్నాం. సుమారు 9.1 కోట్ల మంది ప్రజలపై ప్రభావం పడాలని నేను కోరుకోవడం లేదు. అందుకే ఒక ఒప్పందం చేసుకోవడానికే ఇష్టపడ్డా. మనం గంట వ్యవధిలోనే వారి వంతెనలను కూల్చేయగలం. విద్యుత్ సరఫరా వ్యవస్థను పూర్తిగా నిలిపివేయగలం. వారు నిర్మించిన భారీ ఆధునిక విద్యుత్ కేంద్రాలన్నింటినీ కొన్ని గంటల్లోనే నిర్వీర్యం చేయగలం. ప్రతీ ప్లాంట్ మాయమైపోతుంది. ఆ విషయం ఝుతీఅవనెఅ కూడా తెలుసు' అని ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్ ఒకప్పుడు ఆర్థికంగా బలంగా ఉన్నప్పటికీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని ట్రంప్ వ్యాఖ్యానించారు. అమెరికా నుంచి తమకు ఎలాంటి ఆర్థిక సహాయం అందలేదని కూడా ఆయన స్పష్టం చేశారు.

గతంలో ఇరాన్ నాయకత్వంపై వ్యాఖ్యలు ఇటీవల కూడా ఇరాన్ నాయకత్వంపై ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలకు పలువురు కీలక నాయకులు ఒకేచోట చేరిన విషయాన్ని ప్రస్తావించారు. తాము కోరుకుంటే ఒకే దాడిలో వారందరినీ లక్ష్యంగా చేసుకునే సామర్థ్యం అమెరికాకు ఉందని చెప్పారు. అయితే అలాంటి చర్యకు దిగలేదని, ఎందుకంటే చర్చలు జరిపేందుకు నాయకత్వం అవసరమని పేర్కొన్నారు. సైనిక శక్తి ఉన్నప్పటికీ దౌత్యపరమైన చర్చల ద్వారానే సమస్యను పరిష్కరించాలని అమెరికా భావిస్తోందని ఆయన సంకేతాలు ఇచ్చారు.

ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ తీవ్ర ఆగ్రహం ట్రంప్ వ్యాఖ్యలను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. ఆర్మేనియాలోని ఇరాన్ రాయబార కార్యాలయం సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందిస్తూ అమెరికాపై తీవ్ర విమర్శలు చేసింది. ఖమేనీ మరణంతో ఇరాన్ ప్రజలు అనుభవిస్తున్న బాధను అమెరికా ఎప్పటికీ అర్థం చేసుకోలేదని పేర్కొంది. అమెరికాకు నాగరికత, చరిత్ర, గౌరవం లేదని తెలిపింది. వ్యక్తులను చంపవచ్చు కానీ వారి ఆశయాలను కాదని పేర్కొంది. ఖమేనీని హతమార్చినప్పటికీ ఆయన ఆలోచనాలను అంతమొందించలేరని చెప్పింది. సెంట్ సీసాను పగలగొట్టవచ్చు కానీ దాని పరిమళాన్ని ఆపలేరని ఇరాన్ రాయబార కార్యాలయం తన ప్రకటనలో పేర్కొంది.

ఖమేనీ అంతిమయాత్ర ఇదిలా ఉండగా, ఆయతుల్లా అలీ ఖమేనీ భౌతికకాయాన్ని ఇరాన్‌లోని ఖోమ్ నగరానికి తరలించారు. ప్రభుత్వ టెలివిజన్ ప్రసారం చేసిన దృశ్యాల ప్రకారం హెలికాప్టర్ ద్వారా జమ్‌కరాన్ మసీదుకు ఆయన మృతదేహాన్ని తీసుకువచ్చారు. అంతిమయాత్ర మంగళవారం ఖోమ్‌లో కొనసాగనుండగా, అనంతరం ఇరాక్‌లోని పవిత్ర నగరాలైన నజఫ్, కర్బలా ప్రాంతాలకు తరలించనున్నారు. తర్వాత గురువారం ఇరాన్‌లోని మషద్ నగరంలో అలీ ఖమేనీ భౌతికకాయాన్ని ఖననం చేయనున్నారు. కాగా, ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన వైమానిక దాడిలో అలీ ఖమేనీ చనిపోయారు. అనంతరం సుదీర్ఘ కాలం పాటు పశ్చిమాసియాలో యుద్ధం కొనసాగడం వల్ల ఖమేనీ అంత్యక్రియలు చాలా కాలం ఆలస్యం అయ్యాయి. అయితే, ఖమేనీ అంత్యక్రియల్లో ఆయన కుమారుడు మొజ్తబా ఖమేనీ పాల్గొనలేదు. మొజ్తబా ఖమేనీని హత్యా చేస్తామని ఇజ్రాయెల్ బెదిరిస్తున్న నేపథ్యంలో భద్రతాపరమైన కారణాలతో తన తండ్రి అంత్యక్రియలకు మొజ్తబా హాజరుకాలేదు.

## పొగాకు రైతుల సమస్యలు పరిష్కరిస్తా

మొదటి తరువాయి



ముఖ్యంగా అధిక రిజెక్షన్స్ నమోదవుతున్న ఆక్షన్ ప్లాట్‌ఫార్మ్‌లపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. పొగాకు వేలం కేంద్రాలను సంబంధిత సహచర మంత్రులు స్వయంగా సందర్శించి రైతులతో మాట్లాడాలని, కంపెనీల సిండికేట్ వ్యవహారాలపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి అచ్చెన్నాయుడు కోరారు. ఆక్షన్లలో పాల్గొనకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న కంపెనీలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని టొబాకో బోర్డు అధికారులను మంత్రి ఆదేశించారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, టొబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.విశ్వశ్రీ, చైర్మన్ చిందిపోతు యశ్వంత్ కుమార్ పాల్గొన్నారు.

## ఎల్-నినో ప్రభావంపై రాష్ట్రం హై అలర్ట్

మొదటి తరువాయి

వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో కలిసి రుతుపవనాల పరిస్థితులు, వర్షపాతం లోటు, కరువు ప్రభావం, విపత్తు నిర్వహణ చర్యలపై సమగ్రంగా సమీక్షించారు.

మంత్రి మాట్లాడుతూ విపత్తు సంభవించిన తర్వాత స్పందించడం కంటే వాతావరణ హెచ్చరికల ఆధారంగా ముందస్తు చర్యలు తీసుకోవడమే అత్యంత కీలకమని పేర్కొన్నారు. రాష్ట్ర జిల్లా స్థాయిల్లో 24 గంటల పని చేసే కంట్రోల్ రూమ్‌లు సిద్ధంగా ఉండాలని, భారత వాతావరణ శాఖ ఐఎండీ, ఏపీఎస్డీఎం ఏ, ఐటీడీఎస్ అందించే హెచ్చరికల ఆధారంగా క్షేత్రస్థాయిలో తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎస్ఎంఎస్, వాట్సాప్, సోషల్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రజలకు హెచ్చరికలు వేగంగా చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

కరువుపై ప్రత్యేక దృష్టి:

ఖరీఫ్ సీజన్లో రాష్ట్రంలోని 688 మండలాల్లో 105 మండలాలు తీవ్రంగా, 208 మండలాలు మధ్యస్థాయిలో కరువు ప్రభావానికి గురయ్యే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. సత్యసాయి, అనంతపురం, అన్నమయ్య జిల్లాలో తీవ్ర ప్రభావం ఉండే అవకాశముండగా, కర్నూలు, నంద్యాల, చిత్తూరు, వైఎస్ఆర్ కడప, తిరుపతి, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు జిల్లాల్లో మధ్యస్థాయి ప్రభావం ఉండవచ్చని వెల్లడించారు.

వ్యవసాయ శాఖ రైతులకు ప్రాధాన్యత పంటలు, విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని, డైరెక్ట్ సీడెడ్ రైస్, సిస్టమ్ ఆఫ్ రైస్ ఇంటెన్సిఫికేషన్ విధానాలను ప్రోత్సహించాలని ఆదేశించారు. గ్రామ స్థాయిలో వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాలు అందించాలని సూచించారు.

పశుసంవర్ధక, మత్స్య శాఖలకు తాలూకు ఆదేశాలు: పశుగ్రాసం, దాణా, తాగునీటి ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని, అత్యవసర పశువైద్య సిగ్నల్గా ఉండాలని పశుసంవర్ధక శాఖను ఆదేశించారు. సముద్ర వాతావరణ హెచ్చరికలను ప్రతి మత్స్యకార గ్రామానికి సకాలంలో చేరవేసే, సముద్రం అల్లకల్లోలంగా ఉన్నప్పుడు చేపల వేటను పూర్తిగా నిలిపివేయాలని మత్స్యశాఖను సూచించారు. గ్రామీణ నీటి సరఫరా శాఖ పనిచావేని తాగునీటి పథకాలను 48 గంటల్లో పునరుద్ధరించాలని, అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని ఆదేశించారు.

పట్టణాలు, గ్రామాల్లో ముందస్తు చర్యలు:

గ్రామాల్లో డ్రెన్లు, కాలువలు, చెరువుల పూడికతీత పనులు పూర్తి చేయాలని, గ్రామస్థాయి విపత్తు నిర్వహణ కమిటీలను చురుకుగా పనిచేయించాలని పంచాయతీరాజ్ శాఖకు సూచించారు. పట్టణాల్లో వర్షపు నీటి కాలువలను శుభ్రపరిచి, డీ-వాటరింగ్ పంపులు, అత్యవసర యంత్రాంగాలను సిద్ధంగా ఉంచాలని మున్సిపల్ శాఖను ఆదేశించారు.

## ఎన్సీడీ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలి


**జిల్లా అధికారి రాజరాజేశ్వరి**



**శావల్యాపురం, జూలై 7 (నేటి దర్శిని)**
ఎన్సీడీ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య జిల్లా అధికారిని డాక్టర్ రాజరాజేశ్వరి అన్నారు. మండల కేంద్రమైన శావల్యాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె మంగళవారం అకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలోని అన్ని పాఠశాలలో హెల్త్ ప్రోగ్రాం ఎలా జరుగుతుందో రికార్డులు పరిశీలించారు. పిల్లలందరికీ ఆరోగ్య పరీక్షలు చేయాలని సూచించారు. పిహెచ్సి పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని, అదేవిధంగా ఓపిలు, రోగులకు రక్త పరీక్షలు సక్రమంగా జరుగుతున్నాయో లేదో పరీక్షించారు. అనంతరం కనుమర్లపూడిలో ఆరోగ్య ఉపకేంద్రాన్ని సందర్శించి ఆరోగ్య కార్యక్రమాలు, స్కూల్ హెల్త్ స్టాఫ్ రికార్డులు తనిఖీ చేసి రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య కార్యక్రమమం త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. మండల వైద్యాధికారి రమ్య, సూపర్వైజర్లు నారాయణమ్మ, ఏడుకొండలు, ఉమాదేవి, స్టాఫ్ నర్స్ ధనలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ అయ్యన్న, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ పృద్విరాణి, ఏఎన్ఎం రాజ్యలక్ష్మి ఉన్నారు.

## పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచాలి

**- ఎంఈఓ సాంబశివరావు**



**శావల్యాపురం, జూలై 7 (నేటి దర్శిని)**
: పాఠశాల పరిసర ప్రాంతాల ఎల్లప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని ఎంఈఓ మద్దికుంట సాంబశివరావు అన్నారు. మండలంలోని శానంపూడి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను, ఎస్ హెచ్సి పాఠశాలను మంగళవారం ఎంఈఓ తనిఖీ చేశారు. విద్యార్థుల శక్తి సామర్థ్యాలు పరిశీలించి విద్యా సామర్థ్యాలు తక్కువగా ఉన్న విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థులందరికీ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా కిట్లను అందజేయాలని సూచించారు. హెచ్ఎం శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

## ప్రతి 90 రోజులకు పోలీసు వాహనాల తనిఖీ

**అత్యవసర సేవలకు ఆటంకం లేకుండా నిర్వహణ చర్యలు**



**బాపట్ల, జూలై 7 (నేటి దర్శిని)**
బాపట్ల జిల్లా పోలీసు మోటార్ ట్రాన్స్పోర్ట్ విభాగం ఆధ్వర్యంలో ప్రతి 90 రోజులకు ఒకసారి పోలీసు వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నట్లు ఏఆర్ఎస్ఐ బాల కోటేశ్వరరావు తెలిపారు. ఎస్పీ పర్యవేక్షణలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వాహనాల పనితీరును పరిశీలించి, అవసరమైన మరమ్మతులను గుర్తిస్తున్నారని చెప్పారు. అనంతరం ఎస్పీ అనుమతితో ఆథరైజ్డ్ లేదా ప్రైవేట్ వర్క్షాపుల్లో మరమ్మతులు చేపడుతున్నట్లు వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసు వాహనాలు ఎలాంటి అంతరాయం లేకుండా సమర్థవంతంగా పనిచేసేలా ఈ తనిఖీ ప్రక్రియను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బాపట్ల మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ప్రసన్న కుమార్ పోలీసు వాహనాలను పరిశీలించి, అవసరమైన మరమ్మతులపై సంబంధిత అధికారులకు సూచనలు చేసినట్లు ఏఆర్ఎస్ఐ బాల కోటేశ్వరరావు తెలిపారు.

## నందిగామలో ఆకట్టుకుంటున్న ధోని బర్త్డే భారీ కటౌట్



**నందిగామ జూలై 7 (నేటి దర్శిని)**
టీమిండియా మాజీ కెప్టెన్, మిస్టర్ కూల్ మహేంద్ర సింగ్ ధోనీ (45) పుట్టినరోజు సందర్భంగా దేశవ్యాప్తంగా శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం చెన్నై సూపర్ కింగ్స్ తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న ధోనికి ఏమాత్రం క్రేజ్ తగ్గడం లేదు. ధోనీ బర్త్డే సందర్భంగా ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం అంబారుపేట గ్రామంలో ధోని 77 అడుగుల భారీ కటౌట్ను అభిమానులు ఏర్పాటు చేశారు. ఈ భారీ కటౌట్ అందరినీ ఆకట్టుకుంటున్నది. కాగా, 45వ పడిలోకి అడుగుపెడుతున్న ధోనికి బీసీసీఐ స్పెషల్ విషెస్ చెప్పింది. క్రికెట్ ఐకాన్ అంటూ అభివర్ణిస్తూ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టింది.

# మహిళల భద్రతే లక్ష్యం..

**-నందికొట్కూరులో శక్తి అవగాహన కార్యక్రమం**
**-విద్యార్థినులు ధైర్యంగా ముందుకు రావాలి..**
**- శక్తి యాప్ను వినియోగించాలి**
**- అర్బన్ సీఐ అశోక్ కుమార్**



**నందికొట్కూరు, జూలై 7 (నేటి దర్శిని)**
: మహిళలు, బాలికల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షియోరాన్ ఆదేశాల మేరకు నందికొట్కూరులో విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో మహిళలపై దాడులు, ఈవ్టీజింగ్, సైబర్ నేరాలను అరికట్టే లక్ష్యంతో ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ ఆదేశాల మేరకు నందికొట్కూరు అర్బన్ సీఐ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో శ్రీ నంది జూనియర్ కళాశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ బద్దుల శ్రీకాంత్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 120 మంది ఇంటర్మీడియట్ విద్యార్థినులు, ఉపాధ్యాయులు శంకర్రావు, శంకర్, ఆత్మకూరు సబ్డివిజన్ శక్తి టీం పోలీసులు, రసూల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్బన్ సీఐ అశోక్ కుమార్ మాట్లాడుతూ, ప్రతి మహిళ, బాలిక ధైర్యంగా ఉండాలన్నదే ఎస్పీ సునీల్ షియోరాన్ ప్రధాన లక్ష్యమని అన్నారు. కళాశాలకు వెళ్లే సమయంలో ఎవరైనా వేధింపులకు పాల్పడితే భయపడకుండా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన శక్తి యాప్ను ప్రతి విద్యార్థిని తమ మొబైల్లో తప్పనిసరిగా ఇన్స్టాల్ చేసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ఒక్క క్లిక్తో సహాయం అందుతుందని తెలిపారు. అలాగే శక్తి వాట్సాప్ నంబర్ 7993485111 గురించి వివరించారు. ఈ సందర్భంగా పోక్సో చట్టం, బాల్య వివాహాల నివారణ, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, రహదారి భద్రత, హెల్మెట్ వినియోగంపై కూడా విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఇంటికి వెళ్లిన తర్వాత తమ తల్లిదండ్రుల మొబైల్ ఫోన్లలో కూడా శక్తి యాప్ను ఇన్స్టాల్ చేయించాలని సూచించారు. జిల్లా ఎస్పీ సునీల్ షియోరాన్ మార్గదర్శకత్వంలో జిల్లా వ్యాప్తంగా ఇలాంటి అవగాహన కార్యక్రమాలను కొనసాగిస్తామని అర్బన్ సీఐ అశోక్ కుమార్ తెలిపారు.

## అంతర్జాతీయ అవార్డు

**కలెక్టర్ వినోద్ అభినందనలు అందుకున్న ఫోటోగ్రాఫర్ పి.వి.ఎస్. నాగరాజు**




**బాపట్ల, జూలై 7 (నేటి దర్శిని)**
బాపట్లకు చెందిన ప్రముఖ ఫోటోగ్రాఫర్ పి.వి.ఎస్. నాగరాజు అంతర్జాతీయ స్థాయి గుర్తింపును సొంతం చేసుకున్నారు. ప్రపంచ యోగా దినోత్సవం--2026 సందర్భంగా కేఏ టీవీ ఫోటోగ్రఫీ వరల్డ్, కలకత్తా సంస్థ నిర్వహించిన ఆన్లైన్ ఫోటోగ్రఫీ పోటీలో ఆయన తీసిన ఛాయాచిత్రానికి బెస్ట్ అవార్డు లభించింది. బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ యోగా సాధన చేస్తున్న క్షణాన్ని ప్రతిబింబిస్తూ నాగరాజు తీసిన ఫోటో ఈ అవార్డుకు ఎంపికైంది. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకురాలు సుజాత మండల్ సోషల్ మీడియా ద్వారా నాగరాజుకు అభినందనలు తెలియజేశారు. అవార్డు సాధించిన సందర్భంగా బాపట్లకు చెందిన ఫోటోగ్రాఫర్లు డా.పి.వి.ఎస్. నాగరాజును అభినందించారు. మంగళవారం డా.పి వి ఎస్. నాగరాజు జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ను మర్యాదపూర్వకంగా కలిసి, కలెక్టర్ బృందం యోగా సాధన చేస్తున్న ఫోటోను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్, డా.పి.వి.ఎస్. నాగరాజును అభినందిస్తూ, ఆయన మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## అభివృద్ధి సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం..


**ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య**



**కంచికచర్ల, జూలై 7 (నేటి దర్శిని)**
అభివృద్ధి సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. కంచికచర్ల మండలం గొట్టుముక్కల గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు కోటి 60 లక్షల రూపాయలతో నిర్మించిన సిసి రోడ్లను ఎమ్మెల్యే సౌమ్య కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సౌమ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదన్నారు. గ్రామాల సమగ్రాభివృద్ధి ప్రభుత్వ ధ్యేయమని, ప్రజలకు మెరుగైన రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి మౌలిక వసతులు అందించటం ద్వారా గ్రామీణ జీవన ప్రమాణాలను మరింత మెరుగు పరచటానికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తున్నదన్నారు. అభివృద్ధి ఫలాలు ప్రతి ఇంటికి చేరేలా కూటమి ప్రభుత్వం కార్యాచరణ అమలు చేస్తున్నదన్నారు. నేటి యువతరానికి రాబోయే నవతరానికి కూటమిపాలన స్ఫూర్తిదాయకమన్నారు. అభివృద్ధి సంక్షేమమే కూటమి ప్రభుత్వా నినాదం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీల రాష్ట్ర ఉపాధ్యక్షులు కోగంటి వెంకట సత్యనారాయణ బాబు, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, పిఆర్ ఏఈ రవికుమార్, గోగినేని అమర్నాథ్, బండ్లమూడి గోవర్ధన రావు, గోగినేని శ్రీనివాసరావు, మాజీ గ్రామ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

# అమెరికాలో ఘోర రోడ్డు ప్రమాదం..

**- ఆంధ్రా యువతి దుర్మరణం..!**



**ఎన్టీఆర్ జిల్లా జూలై 7 (నేటి దర్శిని)**
అమెరికా లో ఉన్నత విద్యను అభ్యసించి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకుంటున్న సమయంలో ఓ తెలుగు విద్యార్థిని రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలైంది. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం మూలపాడు గ్రామానికి చెందిన అట్లూరి ప్రసన్న న్యూయార్క్లో జరిగిన కారు ప్రమాదంలో మృతి చెందింది. ఈ ఘటన జూలై 5న చోటుచేసుకుంది. ప్రసన్న తన స్నేహితులతో కలిసి కారులో సమీపంలోని ఆలయానికి వెళుతుండగా మార్గమధ్యలో ట్రాఫిక్ సిగ్నల్ వద్ద వారి వాహనం ఆగి ఉంది. అదే సమయంలో వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన మరో కారు బలంగా ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో ప్రసన్నతోపాటు మరో యువతి కూడా అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. కారులో ఉన్న మూడో వ్యక్తి తీవ్రంగా గాయపడగా.. అతడిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రసన్న ఇటీవలే న్యూయార్క్లోని పేస్ యూనివర్సిటీ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది. మంచి ఉద్యోగం సంపాదించి కుటుంబాన్ని ఆదుకోవాలనే లక్ష్యంతో ఆమె ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలోనే విధి వక్రించి ప్రమాదం రూపంలో ఆమెను కబళించింది. ప్రసన్న మరణవార్త తెలియడంతో ఆమె స్వగ్రామం మూలపాడులో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు.

## రోడ్డు భద్రతపై పాఠశాల యాజమాన్యాలు, బస్సు డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం



**చిట్వేల్, జూలై 7 (నేటి దర్శిని)**
చిట్వేల్ పోలీస్ స్టేషన్ పరిధిలో పాఠశాల యాజమాన్య ప్రతినిధులు, పాఠశాల బస్సు డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల భద్రత దృష్ట్యా పాఠశాల బస్సులు నిబంధనలకు అనుగుణంగా నడపాలని, వాహనాల నిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎస్సై కోరారు.


## జూలై 14లోగా ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించండి..




**బాపట్ల, జూలై 7 (నేటి దర్శిని)**
బాపట్ల ఆర్డీఓ, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఓటర్లకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంపై కీలక సూచనలు చేశారు. ప్రభుత్వం అందజేసిన ఎన్యుమరేషన్ ఫారాన్ని పూర్తి చేసి, కలర్ ఫోటోతో పాటు సంబంధిత బీఎల్ఓకు జూలై 14లోగా సమర్పించాలని కోరారు. ప్రస్తుతం ఈ ప్రక్రియ జిల్లాలో 59 శాతం, బాపట్ల మున్సిపాలిటీలో 49 శాతం మాత్రమే పూర్తయిందని తెలిపారు. ఓటు హక్కు కోల్పోకుండా ప్రతి ఓటరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, కుటుంబ సభ్యులు, పరిసర ప్రాంత ప్రజలకు కూడా అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

# జైలర్ 2 బిజినెస్‌కు భారీ క్రేజ్..

## - రిలీజ్‌కు ముందే మలయాళంలో రికార్డు డిమాండ్



సూపర్ స్టార్ రజినీకాంత్ నటించిన 'జైలర్' సినిమా బాక్సాఫీస్ వద్ద సృష్టించిన సంచలనం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ తెరకెక్కించిన ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ తమిళంతో పాటు తెలుగు, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లోనూ భారీ విజయాన్ని అందుకుంది. ముఖ్యంగా మలయాళ మార్కెట్‌లో ఈ చిత్రం అనూహ్యమైన వసూళ్లు సాధించి రజినీకాంత్ కెరీర్‌లోనే అత్యంత విజయవంతమైన చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. ఇప్పుడు ఈ బ్లాక్‌బస్టర్‌కు సీక్వెల్‌గా రూపొందుతున్న జైలర్ 2 పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల విడుదలైన రిలీజ్ డేట్ గ్లింప్స్ సినిమాపై ఉన్న హైప్‌ను మరింత పెంచింది. సోషల్ మీడియాలో ఆ వీడియోకు విశేష స్పందన లభించడంతో అభిమానుల్లో అంచనాలు రెట్టింపయ్యాయి.తాజా సమాచారం ప్రకారం, జైలర్ 2 విడుదలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, సినిమా థియేట్రికల్ హక్కుల కోసం ఇప్పటికే మలయాళ మార్కెట్‌లో పోటీ మొదలైనట్లు తెలుస్తోంది. ముఖ్యంగా కేరళలో ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థలు ఈ సినిమా హక్కులను దక్కించుకోవడానికి ఆసక్తి చూపుతున్నాయని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మొదటి భాగం కేరళలో అద్భుతమైన వసూళ్లు సాధించడంతో పాటు, మలయాళ స్టార్ మోహన్‌లాల్ ప్రత్యేక పాత్రలో కనిపించడం అక్కడి ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. దీంతో రెండో భాగంపై కూడా ట్రేడ్ వర్గాల్లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. 'జైలర్' తొలి భాగంలో మోహన్‌లాల్ ప్రత్యేక పాత్రకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. అదే తరహాలో 'జైలర్ 2'లో కూడా ఆయన పాత్రకు ప్రాధాన్యత ఉంటుందనే ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై చిత్రబృందం ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. అయినప్పటికీ, రజినీకాంత్‌తో పాటు మోహన్‌లాల్ క్రేజ్ కూడా మలయాళ మార్కెట్‌లో సినిమాకు అదనపు బలం చేకూరుస్తుందనే అభిప్రాయం ట్రేడ్ వర్గాల్లో వ్యక్తమవుతోంది. ప్రస్తుతం వినిపిస్తున్న సమాచారం ప్రకారం, 'జైలర్ 2' థియేట్రికల్ బిజినెస్ ఊహించిన దానికంటే పెద్ద స్థాయిలో జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా దక్షిణాది మార్కెట్‌లో ఈ సినిమాకు భారీ డిమాండ్ ఉండటంతో పంపిణీ హక్కుల కోసం తీవ్ర పోటీ నెలకొనే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే ఈ బిజినెస్‌కు సంబంధించిన వివరాలపై చిత్ర నిర్మాణ సంస్థ నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు.



## సెగలు పుట్టిస్తున్న దివ్య భారతి..


# క్వీన్ 2'కు భారీ షాక్..

## -రిలీజ్‌కు ముందే లీగల్ ట్రబుల్‌లో కంగనా సినిమా!

బాలీవుడ్ నటి కంగనా రనౌత్ కెరీర్‌లో ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన చిత్రాల్లో 'క్వీన్' ఒకటి. 2014లో విడుదలైన ఈ సినిమా విమర్శకుల ప్రశంసలతో పాటు భారీ విజయాన్ని కూడా అందుకుంది. ఇప్పుడు దాదాపు పదేళ్ల తర్వాత ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'క్వీన్ 2' తెరకెక్కుతోంది. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. అయితే విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమాకు ఇప్పుడు ఊహించని లీగల్ సమస్య ఎదురైంది. క్వీన్ 2పై రూ.250 కోట్ల న్యాయపరమైన వివాదం నెలకొనడం బాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. తాజా నివేదికల ప్రకారం, ఫాంటమ్ స్టూడియోస్ ముంబై హైకోర్టులో జియోస్టార్‌పై రూ.250 కోట్ల దావా వేసింది. తమ అనుమతి లేకుండానే క్వీన్ 2 ను రూపొందించారని, ఇది అసలు సినిమా మేధో సంపత్తి హక్కులను ఉల్లంఘించడమేనని సంస్థ ఆరోపిస్తోంది.ఫాంటమ్ స్టూడియోస్ వాదన ప్రకారం, 'క్వీన్' చిత్రానికి సంబంధించిన మేధో సంపత్తి హక్కుల్లో తమకు 50 శాతం వాటా ఉందని, సీక్వెల్‌లు లేదా అనుబంధ చిత్రాలు నిర్మించాలంటే తమ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొంది. 'క్వీన్ 2' నిర్మాణానికి సంబంధించి తమను ఎవరూ సంప్రదించలేదని, సీక్వెల్ నిర్మాణానికి తాము ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని ఫాంటమ్ స్టూడియోస్ కోర్టుకు తెలిపినట్లు సమాచారం. ఈ కారణంగానే ఈ సినిమా తమ హక్కులను ఉల్లంఘిస్తోందని సంస్థ ఆరోపిస్తోంది. తాజా సమాచారం ప్రకారం, ఈ ఏడాది ఏప్రిల్‌లోనే ఫాంటమ్ స్టూడియోస్ ఈ వివాదంపై బహిరంగ ప్రకటన విడుదల చేసింది. అలాగే జియోస్టార్, దర్శకుడు వికాస్ బహల్‌తో పలుమార్లు చర్చలు జరిపి సమస్యను సామరస్యంగా పరిష్కరించేందుకు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. అయితే ఆ చర్చలు ఫలించకపోవడంతో పాటు, 'క్వీన్ 2' షూటింగ్ పూర్తయిందని తెలిసిన తర్వాత సంస్థ కోర్టును ఆశ్రయించినట్లు బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఈ ఆరోపణలపై జియోస్టార్ అధికారికంగా స్పందించలేదు. అలాగే చిత్రబృందం కూడా ఈ వివాదంపై ఎలాంటి ప్రకటన విడుదల చేయలేదు. ఈ నేపథ్యంలో కోర్టు విచారణ ఎలా సాగుతుంది? ఇరు పక్షాలు రాజీకి వస్తాయా? లేక న్యాయపోరాటం మరింత ముదురుతుందా? అన్నది ఆసక్తికరంగా మారింది.



# ఇలాంటి యాక్షన్ రాలేదు!



'అందరూ 'టాక్సిక్' రిలీజ్ ఇన్నిసార్లు ఎందుకు వాయిదా పడిందనే విషయం గురించి మాట్లాడుతున్నారు. కానీ సినిమా కంటెంట్ ఎంత కొత్తగా ఉందో ఆలోచించడం లేదు. ఇలాంటి సినిమాలు ఎప్పుడొచ్చినా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినిస్తాయి' అని చెప్పింది కథానాయిక హ్యూమా ఖురేషి. యశ్ హీరోగా నటిస్తున్న 'టాక్సిక్' సినిమాలో ఆమె ఓ కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఆగస్ట్ 26న ప్రేక్షకుల ముందుకురానుంది. ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన ఈ సినిమా ఎట్టకేలకు రిలీజ్ డేట్‌ను కన్‌ఫర్మ్ చేసుకుంది. ఈ సందర్భంగా ఇచ్చిన తాజా ఇంటర్వ్యూలో హ్యూమా ఖురేషి సినిమా విశేషాలను పంచుకుంది. ఈ చిత్రంలోని కొన్ని భాగాలను మాత్రమే తాను చూశానని, భారతీయ సినిమాలో ఈ స్థాయిలో యాక్షన్‌ను ఇప్పటివరకూ చూడలేదని ఆమె చెప్పింది. 'ఇలాంటి సినిమాలు ఎప్పుడు రిలీజైనా సంచలనం సృష్టించడం ఖాయం. కంటెంట్‌తో పాటు మేకింగ్, యాక్షన్ ఘట్టాలు ప్రేక్షకుల్ని అబ్బురపరుస్తాయి. కథలోని పాయింట్ కూడా ప్రేక్షకుల్ని ఆశ్చర్యపరుస్తుంది' అని హ్యూమా ఖురేషి తెలిపింది. కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మించిన ఈ సినిమా వివిధ భారతీయ భాషల్లో భారీ స్థాయి లో విడుదలకు సిద్ధమవుతున్నది.

# సందీప్ రెడ్డి వంగా బ్యానర్‌లో 'రోమాంచకం'..

## ఆసక్తికరంగా ఫస్ట్ గ్లింప్స్



అర్జున్ రెడ్డి', 'యానిమల్' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలతో ఇండియన్ సినిమాను షేక్ చేసిన స్టార్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా సమర్పణలో ఒక సరికొత్త యూత్‌ఫుల్ లవ్ స్టోరీ రాబోతుంది. భద్రకాళి పిక్చర్స్ బ్యానర్‌పై ప్రణయ్ రెడ్డి వంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి 'రోమాంచకం' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. 'మేమ్ ఫేమస్' చిత్రంతో యూత్‌లో మంచి క్రేజ్ తెచ్చుకున్న యంగ్ హీరో సుమంత్ ప్రభాస్, '8 వసంతాలు' ఫేమ్ అనంతిక సనిల్ కుమార్ ఈ సినిమాలో లీడ్ రోల్స్ పోషిస్తున్నారు.నూతన దర్శకుడు వేణుగోపాల్ రెడ్డి రూపొందిస్తున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక గ్లింప్స్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. ప్రేమ, హాస్యం, ఉత్కంఠ అనే ట్యాగ్‌లైన్‌తో వచ్చిన ఈ గ్లింప్స్ ప్రస్తుతం ఆకట్టుకుంటోంది. ప్రారంభంలో సముద్ర తీరం బ్యాక్‌డ్రాప్‌లో హీరో హీరోయిన్ల మధ్య సాగే బైక్ రైడ్స్, రొమాంటిక్ సీన్స్ ఎంతో ఆహ్లాదకరంగా సాగగా.. అంతా ప్రశాంతంగా సాగుతుందనుకున్న తరుణంలో గ్లింప్స్ ముగింపులో దర్శకుడు ఒక ఊహించని మైండ్ బ్లోయింగ్ ట్విస్ట్ ఇచ్చారు. హీరో హీరోయిన్లు ఇద్దరూ ఒకరినొకరు గట్టిగా చెంపదెబ్బలు కొట్టుకుంటూ 'ఐ హేట్ యూ' అని అరుచుకోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అంతవరకు కూల్‌గా సాగిన వాతావరణం, ఒక్కసారిగా ఇంటెన్స్ ఎమోషనల్‌గా మారిపోవడంతో ఈ ప్రేమకథలో సందీప్ రెడ్డి వంగా మార్క్ గట్టిగానే ఉండబోతోందని స్పష్టమవుతోంది. ఇక వైవిధ్యమైన కంటెంట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రాన్ని సెప్టెంబర్ 3, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది.

# వెంకీ అట్లూరి దర్శకత్వంలో నాని ?



అగ్ర కథానాయకుడు నాని ప్రస్తుతం 'ది ప్యారడైజ్' షూట్‌లో బిజీగా ఉన్నారు. ఆ సినిమా షూటింగ్ ఆలస్యం కావడంతో నానితో సినిమా చేయాలనుకున్న దర్శకులంతా వేరే హీరోల బాట పడుతున్నట్టు వార్తలు వస్తున్నాయి. 'బ్లడీ రోమియో' కథను నానితో తీసేందుకు సిద్ధంగా ఉన్న సుజీత్ సైతం 'ది ప్యారడైజ్' లేట్ కారణంగానే 'ఓజీ 2'ను లైన్‌లో పెట్టే పనిలో పడ్డారని ఇన్‌సైడ్ టాక్. ఇదిలావుంటే.. నాని తాజాగా దర్శకుడు వెంకీ అట్లూరి కథకు ఓకే చెప్పారు. వీరిద్దరి మధ్య చాలాకాలంగా కథా చర్చలు జరుగుతూనే ఉన్నాయి. ఎట్టకేలకు వెంకీ రీసెంట్‌గా చెప్పిన కథ నానిని బాగా ఆకట్టుకున్నదట.దాంతో ఆయన పచ్చజెండా ఊపినట్టు విశ్వసనీయంగా తెలిసింది. సూర్యదేవర నాగవంశీ ఈ సినిమా నిర్మిస్తారట. అందరూ అనుకుంటున్నట్టు దర్శకుడు సుజీత్ 'బ్లడీ రోమియో' కథను పక్కన పెట్టి 'ఓజీ 2'ను లైన్లోకి తెస్తే, 'ది ప్యారడైజ్' తర్వాత నాని చేసే సినిమా వెంకీ అట్లూరిదే అవుతుంది. ఒకవేళ సుజీత్ 'బ్లడీ రోమియో' సినిమానే ముందుకు తెస్తే, ఆ సినిమా పూర్తయ్యాక వెంకీ అట్లూరి సినిమా ఉంటుంది. ఏదేమైనా నాని లైనప్‌లో సరైన సినిమా వచ్చి చేరింది. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సివుంది.

Published and Owned by Katta Hima Pavani Published 19-8-35A,6th Lane, Old Raja Rajeshwaripeta, Vijayawada, Krishna, Andhrapradesh-520001 Printed at Neti Darshini Publications H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505, Editor: Katta Hima Pavani, PRGI NO: APTEL/26/A5450